ప్రజాశక్తి
ఆదివారం 10 సెప్టెంబరు 2023

శ్రీకాకుళం

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కెజిబివి విద్యార్థినులు

పొందూరు : శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని లోలుగు కెజిబివి విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయులు మొకర రూపవతి తెలిపారు. అండర్-14 విభాగంలో షాట్‌పుట్‌లో కె.జానకి ప్రథమ స్థానం, జి.అంజలి తృతీయ స్థానంలో నిలిచారు. అండర్-16 విభాగంలో షాట్‌పుట్‌లో ఎం.ద్రాక్ష ప్రథమ స్థానం, కె.రాజేశ్వరి తృతీయ స్థానం, జావెలిన్ త్రోలో వై.రమ తృతీయ స్థానంలో నిలిచారు. అండర్-18 విభాగంలో షాట్‌పుట్‌లో ఆర్.అనూష ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

బాబు అరెస్టుపై భగ్గు

- చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పలుచోట్ల ఆందోళనలు
- ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు
- ముఖ్య నాయకులు పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- ఉదయం 11 వరకు ఆర్‌టిసి బస్సులు నిలిపివేత

టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు వార్తలతో జిల్లాలో టిడిపి శ్రేణులు భగ్గుమన్నాయి. ప్రభుత్వ తీరుపై మండిపడుతూ అన్ని మండలాల్లోనూ శనివారం ఆందోళనలు చేపట్టాయి. టిడిపి శ్రేణులు రోడ్డు మీదకు వస్తారన్న సమాచారంతో పోలీసులు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడ్డారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ముఖ్య నాయకులను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ప్రధాన పట్టణాల్లోని ముఖ్య కూడళ్లలో పోలీసుల పహారా ఏర్పాటు చేశారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఉదయం 11 గంటల వరకు ఆర్‌టిసి బస్సులను నిలిపివేశారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

ఎచ్చెర్ల : ఎఆర్ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యే అశోక్, కూన రవికుమార్, గుండ లక్ష్మీదేవి తదితరులు

శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో నిలిపివేసిన బస్సులు

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కవిటి మండలం రామయ్యపుట్టుగలోని ఆయన నివాసంలో పోలీసులు అరెస్ట్ చేశారు. సోంపేట సిఐ రవిప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసులు ఉదయం ఐదు గంటలకే ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. ఉన్నపళంగా తమతో రావాలని ఎమ్మెల్యేకి చెప్పడంతో పోలీసులకు, ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసు వాహనంలో ఎమ్మెల్యే అశోక్‌ను ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో కవిటి పోలీస్‌స్టేషన్ వద్ద టిడిపి నాయకులు ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం అంటూ నినాదాలు చేశారు. తక్షణమే ఎమ్మెల్యే అశోక్‌ను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌ను, అరసవల్లిలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని వారి నివాసాల వద్ద అరెస్టు చేసి ఎచ్చెర్లలోని ఎఆర్ గెస్ట్‌హౌస్‌కు తరలించారు. శ్రీకాకుళం నియోజకవర్గ టిడిపి యువ నాయకుడు గొండు శంకర్‌ను లావేర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను కొత్తూరులోని ఆయన నివాసంలో అరెస్టు చేసి నౌపడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొత్తూరు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు అగతముడి అరుణ్ కుమార్, పి.మోహనరావుతో పాటు మరో 26 మందిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

టిడిపి సంతబొమ్మాళి అధ్యక్షులు జీరు భీమారావును గృహ నిర్బంధం చేసి, టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలాకి మండలంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పోలాకి, పిన్నింటిపేటలో ఆందోళనలు చేపట్టిన టిడిపి నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

ఇచ్ఛాపురం పట్టణంలో టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, సాలీనా ఢిల్లీ, కొండ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బస్టాండ్ కూడలి నుంచి మార్కెట్ వరకు శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన నిరసన తెలిపారు. చంద్రబాబు అరెస్టును జనసేన ఇచ్ఛాపురం నాయకుడు లోళ్ల రాజేష్ ఒక ప్రకటనలో ఖండించారు.

ఆమదాలవలస : సుజాతను అరెస్టు చేస్తున్న పోలీసులు

వజ్రపు కొత్తూరు మండలంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఆందోళన చేపట్టిన మాజీ ఎంపిపి గొరకల వసంతరావు, టిడిపి నాయకులు కణితి సురేష్, గిరి కూన షణ్ముఖరావు, ఎస్.చిట్టిబాబుతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో గాంధీ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించి బస్టాండ్ రోడ్డుపై బైఠాయించారు. ఇందిరాగాంధీ చౌక్ వద్ద మానవహారం చేపట్టారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుతో పాటు మరో ముగ్గురిని ముందస్తు అరెస్టు చేశారు. శనివారం రాత్రి టిడిపి నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఆమదాల వలసలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు మెట్ట సుజాత, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద మెయిన్ రోడ్డుపై ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సుజాతను ఆటోలో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించేలోగా ఆమె ఆటో నుంచి కిందకు దిగి రోడ్డుపై బైఠాయించారు. అనంతరం పోలీస్ జీపులోకి ఎక్కించి తరలించారు. మొదలవలస రమేష్, నూకరాజు, అన్నెపు భాస్కరరావు, సనపల అప్పలనాయుడు తదితరులను గృహ నిర్బంధం చేశారు.

ఆర్‌టిసి బస్సులు నిలిపివేత

చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ముందుజాగ్రత్తగా ఆర్‌టిసి బస్సులను నిలిపివేశారు. ఉదయం 4.30 గంటల నుంచి బస్సులను ఆపేశారు. మార్గమధ్యంలో ఉన్న బస్సులను సమీప పోలీస్‌స్టేషన్లకు తరలించారు. బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో బస్సుల్లేక గంటల తరబడి ఆర్‌టిసి కాంప్లెక్స్‌ల్లోనే ఉండిపోయారు. కొందరు ప్రయివేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయించారు. ఉదయం 11 గంటలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించారు.

సరుబుజ్జిలి కూడలిలో టిడిపి మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, నాయకులు ఆందోళన చేపట్టారు. దీంతో అలికాం-బత్తిలి రోడ్డు ఇటు పాలకొండ రోడ్డులో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. పోలీసులు రంగప్రవేశం చేసి టిడిపి నాయకులు శివ్వాల సూర్యం, నందివాడ గోవిందరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు, ఎండ రామారావు, కె.రవికుమార్‌ను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నందిగాం మండల కేంద్రంలో సత్యసాయిబాబా ఆలయం నుంచి జాతీయ రహదారి వరకు టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. దీంతో అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రంగప్రవేశం చేసి తెలుగు యువత మండల అధ్యక్షులు తూలుగు మహేష్, టిడిపి మండల అధ్యక్షులు అజయ్ కుమార్‌తో పాటు పలువురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డు, కొత్తపేట నుంచి టిడిపి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

మెళియాపుట్టిలోని జాడుపల్లిలో టిడిపి నాయకులు ఆందోళన చేపట్టారు. టిడిపి మండల అధ్యక్షులు భాస్కరగౌడతో పాటు పలువురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

టెక్కలిలో టిడిపి నాయకులు బగాది శేషగిరిరావుతో 24 మంది నాయకులను అరెస్టు చేశారు.

లావేరులో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర, పి.మధుబాబును అరెస్టు చేసి బూర్జ పోలీస్‌స్టేషన్‌కు అరెస్టు చేశారు. లావేరులో రాత్రి సిఎం జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను టిడిపి నాయకులు దహనం చేశారు.

కొత్తూరు : మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను అరెస్టు చేస్తున్న పోలీసులు

సోంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట టిడిపి నాయకులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సూరాడ చంద్రమోహన్, దూసి మధు, చిత్రాడ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంచిలిలోని ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద నుంచి టిడిపి నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదిన రామారావు, ఎం.పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు మండలం చల్లవానిపేట నాలుగు రోడ్ల కూడలిలో టిడిపి నాయకులు ఆందోళన చేపట్టి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, దుంగ స్వామిబాబుతో పాటు పలువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బూర్జ మండలంలోని 33 మంది టిడిపి నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో సీతారాంబాబునాయుడు, మజ్జి శ్రీరాములు నాయుడు, లంక జగన్నాథంనాయుడు ఉన్నారు.

రణస్థలం జాతీయ రహదారిపై టిడిపి నాయకులు ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న జె.ఆర్.పురం ఎస్ఐ రాజేష్ పోలీస్ సిబ్బందితో చేరుకుని 48 మందిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

15 నాటికి పూర్తి కావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో చేపడుతున్న ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల నమోదు ప్రక్రియను ఈనెల 12వ తేదీ నాటికి అన్నిరకాల ఫారాలను ముగించి, 15 నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియ-24పై ఇఆర్‌ఒలు, తహశీల్దార్లు, ఇడిటిలు, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు ఇంటి నంబర్ల మార్పులు, పది మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న గృహాలు, వందేళ్లు నిండిన ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఈ మూడు వివరాలు జూన్ నాటికే సమాచారం అందుబాటులోకి వచ్చిందన్నారు. అయినా ఇప్పటివరకు పెండింగ్ ఉందని, దీనిపై అధికారులు సమీక్షించుకోవాలని చెప్పారు. ఈనెల 15వ తేదీ నాటికి అన్ని పూర్తి కావాలని ఆదేశించామని, పలు సమావేశాలు నిర్వహించామని తెలిపారు. గడువుకు అతి తక్కువ సమయం ఉన్నందున శని, ఆదివారాలు సెలవు రోజులైనా విధులకు హాజరై పూర్తి చేయాలని ఆదేశించారు. మూడు నెలల కిందటే ఫారం-8 తీసుకున్నా, వాటిని అప్‌డేట్ చేయకపోవడానికి గల కారణాలు వివరించాలని కోరారు.

ఇప్పటివరకు ఫారం-6 దరఖాస్తులు 26 వేలు, ఫారం-7 దరఖాస్తులు 11,500, ఫారం-8 దరఖాస్తులు 32,500 మొత్తం 70 వేలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. జిల్లాలో 2,342 మంది బిఎల్‌ఒలు ఉన్నారని, సగటున 35 ఫారాల వరకు వస్తాయన్నారు. ఇంటింటి సర్వే పూర్తయి 17 రోజులైనా ఒక్కో బిఎల్‌ఒ 35 ఫారాలు కూడా పూర్తిచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. డ్రాఫ్ట్ రోల్ ఈనెల 17వ తేదీ నాటికి వచ్చే అవకాశం ఉందని, నిర్లక్ష్య ధోరణి వల్ల వాటిపై ప్రభావం చూపుతుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని సకాలంలో జరగాలని, ఇందుకు పెండింగ్‌లో ఉన్న అన్ని ఫారాలు పూర్తి కావాలన్నారు. శ్రీకాకుళం, పాతపట్నం, సంతబొమ్మాళి తహశీల్దార్లు, ఇడిటిలు వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, ఇఆర్‌ఒలు, తహశీల్దార్లు, ఇడిటిలు, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

చట్టం ఎవరికీ చుట్టం కాదు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - పోలాకి

స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో రూ.550 కోట్ల అవినీతికి పాల్పడినందునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు జైలు ఊచలు లెక్క పెట్టాల్సి వచ్చిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబుకు ఈ విషయం ఇప్పటికి అర్థమై ఉంటుందని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుతో రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వైసిపి శ్రేణులు వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసిపి సోషల్ మీడియా విభాగం ఈ విషయంలో చురుగ్గా ఉండాలని, బాబు ఏ తప్పు చేయలేదని పచ్చ మీడియా గగ్గోలు పెట్టే అంశాలను, అసత్యాలను తిప్పికొట్టాలని సూచించారు. ఈ కేసులోని అన్ని అంశాలను సామాన్య ప్రజలకు సైతం పూర్తిగా తెలిసేలా వాస్తవాలను వివరించడంలో సోషల్ మీడియా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రభుత్వ ఖజానాను దోచేసి, పోలవరం లాంటి ప్రాజెక్టులను ఎటిఎంలా వాడుకొని రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన చంద్రబాబుపై పూర్తిస్థాయి విచారణలు చేపట్టి తిన్న సొమ్మంతా కక్కించాల్సి ఉందని పేర్కొన్నారు.

ప్రజా వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజా వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రూ.1.8 కోట్లతో నగరంలోని రామకష్ణనగర్‌లో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎనిమిది డివిజన్లకు ఈ అర్బన్ హెల్త్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. ప్రైవేటు ఆస్పత్రి ఖర్చులు తగ్గించానే ఉద్దేశంతో అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలో కన్నా ఇప్పుడు ప్రభుత్వాస్పత్రుల్లో ఎన్నడూ లేని విధంగా సిబ్బంది నియామకం చేపట్టామన్నారు. గతంలో మందులు, వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండే వారు కాదని, ఇప్పుడు 170 రకాల మందులను అందుబాటులో ఉంచామన్నారు. 63 టెస్ట్‌లు ఉచితంగా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేసు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి, వైసిపి పట్టణాధ్యక్షులు సాధు వైకుంఠరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి, డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ పైడి మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

తప్పు చేయకుంటే ఆందోళన ఎందుకు?

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం ప్రతినిధి : బాధ్యత గల ప్రతిపక్ష నాయకునిగా దర్యాప్తునకు చంద్రబాబు సహకరించాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. చంద్రబాబు అరెస్టుకు సంబంధించి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు చట్ట ప్రకారమే అరెస్టు చేశారని తెలిపారు. తనకు వ్యతిరేకంగా సాక్ష్యాలు లేవని చంద్రబాబు చెప్తున్నారని, అటువంటప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బాధ్యత గల ప్రతిపక్ష నాయకునిగా చట్టాన్ని గౌరవించాల్సి ఉంటుందని, నిర్దోషిత్వాన్ని కోర్టులో నిరూపించుకోవాలన్నారు. వాస్తవానికి ఎఫ్ఐఆర్ 2012లో నమోదైందని, చంద్రబాబు అంటున్నట్లు సిఐడి అరెస్టు చేయాలంటే ఎప్పుడో చేసేదని చెప్పారు. స్కాంతో సంబంధం లేకపోతే కోర్టులో నిరూపించుకుని బయటకు రావాలే తప్ప అనవసరమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. మాజీ ప్రధాని పి.వి నరసింహారావుపై ఆరోపణలు వచ్చిన సందర్భంలో విచారణకు సహకరించి నిర్దోషిగా బయటపడ్డారని గుర్తుచేశారు. దర్యాప్తు సంస్థ దురుద్దేశంతో అరెస్టు చేస్తే అరెస్టు అక్రమమా, సక్రమమా అనేది కోర్టు పరిశీలిస్తుందని చెప్పారు. పోలీసులపై చంద్రబాబు ఆరోపణలు చేయకుండా విచారణ సంస్థకు సహకరిస్తే మంచిదని అభిప్రాయపడ్డారు.

లోక్‌అదాలత్‌లో 9,255 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 21 లోక్ అదాలత్ బెంచ్‌ల్లో 9,255 కేసులను పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ మౌలానా అహ్మద్ తెలిపారు. ఈ అదాలత్‌లలో 4,84,09,661 మంది కక్షిదారులు భాగస్వాములై లబ్ధి పొందారని చెప్పారు. పరిష్కారమైన 9255 కేసుల్లో క్రిమినల్ కేసులు 9005, ప్రి లిటిగేషన్ కేసులు 108, సివిల్ కేసులు 142 ఉన్నాయన్నారు. జిల్లా ప్రధాన కేంద్రంలో ఆరు అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ అదాలత్‌లో జడ్జి ఎస్‌ఎం ఫణికుమార్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఆర్.సన్యాసినాయుడు, సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, మెజిస్ట్రేట్‌లు శారదాంబ, భరణి, విద్య పాల్గొన్నారు.

సాగునీరు ఇవ్వలేని వైఫల్యం ఎవరిది?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పూర్తిస్థాయిలో పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది. సెప్టెంబర్ రెండో వారంలోకి ప్రవేశించినా జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు సాగవ్వలేదు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,37,165 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్దేశించుకోగా 3,67,643 ఎకరాల్లో పంటలు వేయగలిగారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 3,39,588 ఎకరాల్లో సాగవుతోంది. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 70 వేల ఎకరాల్లో పంటలు సాగవ్వలేదని వ్యవసాయశాఖ నివేదికలు చెప్తున్నాయి. అందులో వరి పంటే 59 వేల ఎకరాలకు పైగా ఉంది. పంటలు సాగైనట్లు లెక్కలు చెప్తున్నా కొన్నిచోట్ల ఎండిపోతున్నాయి. వర్షాధారంపై సాగవుతున్న మెట్ట ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉందంటే అర్థం చేసుకోవచ్చు. సాగునీటి సౌకర్యం ఉన్న వంశధార ఆయకట్టు రైతులకు ఈ దుస్థితి వచ్చిందంటే అది పాలకుల వైఫల్యంగానే చూడాల్సి ఉంటుంది. ఒడిశాలో కాస్తాకూస్తో వర్షాలు పడుతుండడంతో హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద తగినంత నీటి నిల్వలు ఉండనే ఉన్నాయి. కాలువల్లోకి నీటిని విడిచిపెడుతున్నా, అవి శివారు భూములను చేరడం లేదు. కాలువల్లో పెద్దఎత్తున పూడిక, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. కొన్నేళ్లుగా ఎప్పుడూ పూర్తిస్థాయిలో నీరిచ్చిన దాఖలాల్లేవు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో గుర్రపుడెక్క తొలగింపు, కాలువ అడుగ భాగాన కాంక్రీట్ పూతకు రూ.10 కోట్లు కావాలని వంశధార అధికారులు మొరపెట్టుకున్నా ప్రభుత్వం పైసా విదల్చలేదు.

వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కుల కాగా కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో రెండు వేల క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టడం లేదు. అదేవిధంగా కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 600 క్యూసెక్కులకు మించి వదలడం లేదు. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం వల్లేనని అధికారులు సైతం చెప్తున్నారు. ఈ పరిస్థితి నుంచి నుంచి గట్టెక్కాలంటే వంశధార ఎడమ కాలువను ఆధునీకరించాలని చాలాకాలంగా అధికారులు చెప్తున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.300 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపినా నాటి ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. అంచనా వ్యయం అంతకంతకూ పెరిగి ఇప్పుడది రూ.953 కోట్లకు చేరింది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా రెండు మూడు పర్యాయాలు ప్రతిపాదనలు పంపినా ఇప్పటివరకు ఆమోదం తెలపలేదు.

షట్టర్ల కొనుగోళ్లలో అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేయడంతో దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. ఘటన జరిగి 13 ఏళ్లు అవుతున్నా, అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపలేదు. దీంతో కొత్త షట్టర్లు అమర్చలేక పాతవాటితోనే నెట్టుకొస్తున్నారు. ఫలితంగా శివారు భూములకు సాగు నీరు అందని పరిస్థితిని చూస్తున్నాం ఈ అంశంపై ప్రభుత్వం దృష్టిసారిస్తే సమస్య పరిష్కారమవుతుందని పలుమార్లు అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపించలేదు. వంశధార కాలువల ద్వారా సాగునీరందకపోవడానికి ఉన్న కారణాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతిపక్ష టిడిపిపై నెట్టేస్తున్నారు. నీరు-చెట్టు అవినీతి వల్లే సాగునీటి సమస్యలు తలెత్తాయంటూ నిందిస్తున్నారు. పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తమ ప్రాంతంలోని శివారు భూములకు నీరందడం లేదని టెక్కలి నియోజకవర్గంలోని మూడు వేల ఎకరాలకు నీరందించే 16 ఎత్తిపోతల పథకాలకు ఏకంగా విద్యుత్ సరఫరాను నిలిపివేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వంశధార ఆధునీకరణ, గుర్రపుడెక్క తొలగింపునకు ప్రభుత్వం ద్వారా నిధులు విడుదల చేయించి శివారు భూములకు నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాల్సిన మంత్రి అప్పలరాజు ఎత్తిపోతల పథకాలకు నీరు ఆపేయడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి కరుణించక, ప్రభుత్వం నిధులు విదల్చక ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేలాది ఎకరాల్లో పంటలు వేయలేకపోయారు. వర్షాల్లేక, కాలువల ద్వారా సాగునీరు రాక పంటలు ఎండిపోయి రైతులు గగ్గోలు పెడుతున్నారు. కరువుఛాయలు అలుముకుంటున్న తరుణంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరినొకరు దూషించుకోవడం మాని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంది.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AMADALAVALASA
O.S.11/2020

Between: **A.P. Grameena Vikas Bank, Kollivalasa Branch, Rep. by its Branch Manager.** --Plaintiff
And: **Illipilli Lakshmi (Died) & others.** --Defendants
To, **D-2. Illipilli Sairam,** S/o. Late Yerram Naidu, aged 44 years, R/o. Cheedivalasa (V), Burja Mandal, Srikakulam Dt.
D-3. Illipilli Saikrishna, S/o. Late Yerram Naidu, aged 42 years, --rest -do--

Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the same is stands posted to **05.10.2023 at 10.30 A.M.** for yours' appearance. On that day you shall personally or through an Advocate attend before the above named Hon'ble Junior Civil Judge court, Amadalavalasa, failing which the matter will be heard and determined in your absence ex-parte as per law.

By Court Order
Ch. Satyanarayana
Advocate for Plaintiff,
Amadalavalasa,
Cell No.9848098139.

Issue Notice U/order 21 Rule 64 of CPC
IN THE HONOURABLE COURT OF THE IIIrd ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
EP No 604/2019 in ARC No 627/2018.
BETWEEN:
Shriram city Union Finance Ltd .... **Petitioner**
AND
Suvvari Padma & Others ... **Respondents**
To
R-1 : Suvvari Padma W/o Govinda Rao R/o Door No 2-25, Main Street, Kinthali Village, Ponduru Mandalam, Srikakulam Dist.

NOTICE

Take notice that the above Suit is posted for your notice and that you are hereby appear before the Honourable court of the **IIIrd Additional District Judge, Srikakulam** on **11.09.2023** at **10-30** A.M personally or through Advocate. If you fails to appear the matter will be decide exparte.

MANCHU JANARDHANA RAO, Advocate
Plot No.21 & 22, Surya Nagar, Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Phone : 9849178948

కేసుల రాజీతో కక్షిదారులకు సమన్యాయం

పొందూరు : లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జడ్జి జ్యోత్స్న

ప్రజాశక్తి- పొందూరు

లోక్‌అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న పేర్కొన్నారు. పొందూరు జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 440 కేసులను పరిష్కరించగా, ఇందులో 7 సివిల్, రెండు ఎన్ఐ, 35 ఐపిసి, 387 ఎస్‌టిసి, రెండు పిఎల్‌సి, ఏడు అడ్మిషన్ ఉన్నాయి. కార్యక్రమంలో ఎపిపి రొక్కం శ్యామ్‌సంతోషి, లోక్‌అదాలత్ మెంబర్ ఎ.రంగారావు, రాజాం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.మంజుల, న్యాయవాదులు బ్రహ్మాజీ, డి.కిరణ్‌బాబు, అశోక్‌కుమార్, రామ్మోహన్ పాల్గొన్నారు.

688 కేసులు పరిష్కారం

కోటబొమ్మాళి: స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు అవరణలో జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాసంఘం అధ్యక్షులు డి.భరణి ఆధ్వర్యాన అంతర్జాలం ద్వారా నిర్వహించిన జాతీయలోక్ అదాలత్‌లో 688 కేసులు పరిష్కరించామని కోర్టు సిబ్బంది తెలిపారు. ఇందులో 196 క్రిమినల్ కేసులు, 489 పెట్టీ కేసులు, ఒక్క మనోవర్తి కేసు, రెండు బ్యాంకులకు సంబంధించినవి పరిష్కరించామన్నారు. బెంచ్ సభ్యులుగా పంచిరెడ్డి అర్జుణరావు, బి.నారాయణ రావులు న్యాయవాదులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో న్యాయవాధుల సంఘం అధ్యక్షుడు డి.నరసింహమూర్తి, సీనియర్ న్యాయవాధులు పల్లి వాసుదేవరావు, పూజారి వాసుదేవరావు, వెలమల అప్పలనాయుడు, బి.ధర్మారావు, ఎపిపి డి.హరిప్రియ, కోర్టు కానిస్టేబుల్ బి.బాలకృష్ణ, వెంకటరావు, నాగరాజు, అశోక్, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు, నౌపడ స్టేట్‌బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

504 కేసులు...

టెక్కలి : కక్షిదారులు తమ కేసులు రాజీ విషయంలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తిలు కోరారు. స్థానిక కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రెండు బెంచ్‌లు ద్వారా 504 కేసులు పరిష్కరించారు. వీటి ద్వారా రూ.7,97,660 ప్రభుత్వానికి జమైంది. వీటిలో 4 సివిల్ కేసులు, 2 హిందూ వివాహ చట్టం కేసులు, 498 క్రిమినల్ కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఆధ్యక్షులు దివ్వల వివేకానంద, పొట్నూరు ఆనందరావు, బి.శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

టెక్కలి : లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జిలు

పలాస : లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జడ్జి చక్రవర్తి మల్లా

819 కేసులు...

పలాస : పలాస కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 819 కేసులు పరిష్కామరయ్యాయని ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి చక్రవర్తి మల్లా తెలిపారు. సివిల్ వేదు, మని సూట్ ఒకటి, మెంట్నెన్స్ కేసు ఒకటి, అడ్మిషన్ 787, కాంపొండబుల్ 23 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్‌రాజు, ట్రజరర్ రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ ఫయాద్ అహ్మద్, న్యాయ వాదులు పి.ఎల్.నారాయణ, చంద్రశేఖర్, ఎస్.వి.రమణ, కోత రజనీకుమార్, ప్రభాకర్, లక్ష్మి, దివ్య, చిట్టిబాబు, కోర్టు సూపరింటెండెంట్ పాణిగ్రహి గోవింద్ పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

సచివాలయాలతో మెరుగైన పాలన

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సచివాలయాలతో ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తొగరాంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని అన్నారు. నేడు గ్రామ సచివాలయాలు దగ్గరే అన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల ఒరవడి కొనసాగుతుందన్నారు. అనంతరం తమ్మినేని ఇందుమతి, శ్రీరామ్మూర్తి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా తొగరాం, దూసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెరో ఒకటి చొప్పున ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, అడిషనల్ డిఎంహెచ్ఒ అనురాధ, వైద్యులు మెట్ట స్రవంతి, పి.శ్రీనివాసరావు, పి.సుజాత, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కణితి' త్యాగాలు మరువలేనివి

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పేద విద్యార్థులు సాంకేతికపరంగా అభివద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రయివేటు ఐటిఐ నెలకొల్పిన విద్యాదాత డాక్టర్ కణితి విశ్వనాథం త్యాగాలు మరువలేనివని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం అంతర్జాతీయ లయన్స్ క్లబ్ నిధులతో నూతనంగా నిర్మించిన ఐటిఐ విద్యార్థుల వసతి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 దశకంలో అభివృద్ధి చెందని ఈ ప్రాంతంలో తన సొంత భూముల్లో ప్రయివేటు ఐటిఐ నెలకొల్పి వేలాది మంది విద్యార్థులకు విద్యాదానం చేసిన మహానీయుడని కొనియాడారు. కార్యక్రమంలో రవి కోత (ఐఎఎస్), లయన్స్ గవర్నర్ ఎ. గోపాలరావు, ఎన్.వి.ప్రసాద్ (మొదటి వైస్ గవర్నర్), రెండో వైస్ గరవ్నర్ సూర్యప్రకాష్, పిడిజి లయన్ ఉషారాజు, డాక్టర్ శారద, డాక్టర్ రాజేంద్ర, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఐటిఐ సిబ్బంది రవి, శ్రీదేవి, వూన వెంకటరావు, కిశోర్, చౌదరి, రమణయ్య పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పూండి-గోవిందపురం పంచాయతీలో సర్పంచ్ పాలిన రమ్య అధ్యక్షతన, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ పాలి శ్రావణి ఆధ్వర్యాన శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తులు, దళారీ వ్యవస్థ లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో రూ.700 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే ప్రాజెక్టు నిర్మించామని తెలిపారు. పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేందుకు రెండు వందల పడకల కిడ్నీ ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, ప్రతినిధి ఉదయ్ కుమార్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు గురయ్యానాయుడు, మందస ఎంపిపి డొక్కరి దానయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహార ప్రదర్శన పరిశీలన

పౌష్టికాహారం లోపిస్తే పలు సమస్యలు తలెత్తుతాయని పశుసంవర్ధక మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పూండిలో అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వరాన నిర్వహించిన పౌష్టికాహార ప్రదర్శనను శనివారం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు అందరికీ పోషకాహారం చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా పంపిణీ చేశారు. పోషక ఆహారంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ పాలిన శ్రావణి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, తహశీల్దార్ అప్పలస్వామి, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, అంగన్వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, గోవిందపురం అంగన్వాడీ కార్యకర్త కరుణ, మంజు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన

'వందాన' ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని 80 అడుగుల రోడ్డులో నూతనంగా నిర్మించిన వందాన ఆస్పత్రిని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ వందాన శేషగిరిరావు కుటుంబం ఎన్నో ఏళ్లుగా వైద్య వృత్తిలో కొనసాగుతూ ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారని అన్నారు. ఆత్యాధునిక హంగులతో ఆస్పత్రిని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సచిత్ర, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, డాక్టర్ కె.అమ్మన్నాయిడు, డాక్టర్ ధర్మాన లక్ష్మీనారాయణ, డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ శేషగిరిరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలుపుతున్న శివారెడ్డి, తదితరులు

'ఎన్ఇఆర్'కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విజయనగరం జిల్లా బిజెపి అధ్యక్షులుగా నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) నియమితులయ్యారు. ఈ మేరకు మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో ఆయన స్వగృహం వద్దకు శనివారం నాయకులు, అభిమానులు పాల్గొని అభినందనలు తెలుపుతూ పుష్పగుచ్ఛాలను అందజేశారు. కార్యక్రమంలో ఎపి వర్కింగ్ జర్నలి నాయకులు, సీనియర్ పాత్రికేయులు బలివాడ శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా మాజీ అధ్యక్షులు శివారెడ్డి, మాజీ జెనరల్ సెక్రెటరీ పావంగి పల్లి అశోక్, విజయనగరం మండల అధ్యక్షులు ఇప్పిలి గోపాలకృష్ణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బూర జగ్గారావు, ఇజ్జడ శ్రీనివాసరావు, సంపతిరావు నాగేశ్వరావు, లెంక అప్పలనాయుడు, ఎస్‌సి మోర్చా జోనల్ ఇన్‌ఛార్జి దుక్క ఆదినారాయణ, సీనియర్ నాయకుడు పతివాడ పైడి నాయుడు, ఎస్‌సి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దన్నాన రాజేంద్ర, జిల్లా కార్యదర్శి పి.వి.రత్నం, జి.సిగడాం మండల అధ్యక్షులు వజ్జపర్తి రఘురామ్, కయిత రమణ పాల్గొన్నారు

సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

విలువలతో కూడిన విద్య అవసరం

టెక్కలి : చిన్నతనం నుంచే విలువలతో కూడిన విద్య అవసరమని ఎంఇఒ దల్లి తులసిరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు అభిప్రాయపడ్డారు. స్థానిక ఓక్లాండ్ ఆంతర్జాతీయ పాఠశాల్లో శనివారం గ్రాండ్ పేరెంట్స్ దినోత్సవం నిర్వహించారు. సమాజంలో విద్యతో పాటు విలువలనూ నేర్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ల మధులత, బాలకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

డిప్యూటీ స్పీకర్ దృష్టికి క్రిస్టియన్ల సమస్యలు

సన్మానిస్తున్న అన్వేష్

ఇచ్ఛాపురం : జిల్లాలోని క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ కోరారు. విజయనగరంలో సిమ్మ బాబిస్ట్ చర్చ 148 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ ముఖ్య కోలగట్ల వీరభద్రస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని అన్వేష్ తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రత్నం బాలరాజు

జంగిల్ పనులు పరిశీలన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అమలపాడు నుంచి పూడి రామారావు కూడలి వరకు గల రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలను సర్పంచ్ దున్న. రత్నం, బాలరాజు ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. రహదారి పైకి ఇవి రావడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో సంవత్సరానికి రెండు లేదా మూడుసార్లు బాగుచేస్తున్నామన్నారు. బసుమారు ఐదు కిలో మీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఆయనతోపాటు వైఎస్ఆర్‌సిపి క్లస్టర్ ఇంచార్జ్ గొరకాల విశ్వనాధం ఉన్నారు.

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : మండలంలోని పెదరావుపల్లి మాజీ సర్పంచ్ ఆరంగిపేటకు చెందిన అరంగి అప్పారావును వైసిపి నియోజకవర్గ నాయకుడు లుకలాపు అప్పలనాయుడు శనివారం పరామర్శించారు అప్పారావు ఇటీవల అనారోగ్యనికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసు కుంటున్నారు. విషయం తెలుసుకున్న అప్పలనాయుడు పరామర్శించి అనారోగ్యం గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపిటిసి తేనెల సురేష్ కుమార్, మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, గొర్లె రాంబాబు, పి.గురునాయుడు ఉన్నారు.

నూతన లయన్స్ క్లబ్‌ల ఏర్పాటే లక్ష్యం

రక్తదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన సేవలను ప్రజలకు చెరువ చేస్తూ... అధికంగా నూతన క్లబ్‌లను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎ.గోపాలరావు అన్నారు. నగరంలోని సానా వీధిలో ఉన్న లయన్స్ క్లబ్ హర్షవల్లి కార్యాలయంలో శనివారం జిల్లా గవర్నర్స్ డే లాంగ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన 13 లక్షల 50 వేల మంది సభ్యులుగా ఉన్నారని అన్నారు. అందువల్ల నూతన క్లబ్‌లను, నూతనంగా చేరుతున్న సభ్యులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. నగరంలోని, అన్ని పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ లయన్స్‌క్లబ్‌లు ఏర్పాటయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంకులో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్, రెండో వైస్ ప్రెసిడెంట్ డి.సూర్యప్రకాష్, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ విప్పల ప్రసాద్, డిస్టిక్ ట్రెజరీ పి.కాళిదాస్, తిరుమల శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికాప్రసాద్, అధ్యక్షులు కరణం శోభారాణి పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడడం వల్లే అరెస్టు

ఆమదాలవలస : మాట్లాడుతున్న చింతాడ రవి

టెక్కలి రూరల్ : నైపుణ్యాభివృద్ధి సంస్థలో రూ.550 కోట్ల అవినీతికి పాల్పడ్డారనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చిందని, ఇన్నాళ్లకు అతని పాపం పండిందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు శనివారం జగతిమెట్ట సమీప కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం ఎవరికీ చుట్టం కాదని, వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబుకు ఈ విషయం ఇప్పటికి అర్థమై ఉంటుందన్నారు. చంద్రబాబు అరెస్టుతో రాష్ట్రంలో అలజడులు సష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వైకాపా శ్రేణులు వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ ఎక్కడున్నావు, బయటికి వచ్చి చంద్రబాబుని ప్రశ్నించాలని సూచించారు. చంద్రబాబు అవినీతిపై ప్రజా దర్బార్ ఏర్పాటు చేసి ప్రశ్నించిననాడే జనసైనికులు నిన్ను నమ్ముతారని సూచించారు.

జలుమూరు : ప్రభుత్వ ఖజానాను దోచేసి రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసిన చంద్రబాబును అరెస్టు చేయకూడదో చెప్పాలంటూ వైసిపి నాయకులు ప్రశ్నించారు. ఎంపిడిఒ కార్యాలయంలోని ఎంపిపి ఛాంబర్లో శనివారం ఎంపిపి వాన గోపి విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపిపి వాన గోపి తోపాటు వైస్ ఎంపిపి తంగి మురళీకష్ణ, మండల వైసీపీ అధ్యక్షులు కనుసు సీతారాం, మండల సలహాదారుడు పైడి విఠల్ రావు, అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులు మొజ్జాడ శ్యామలరావు, మాజీ ఎస్ఎస్ అధ్యక్షులు పొన్నాన ముసలి నాయుడు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు దామ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : దేశంలోనే అత్యంత అవినీతిపరుడు చంద్రబాబు నాయుడు అని అతని అరెస్టు సబబేనని వైఎస్ఆర్‌సిపి ప్రచార విభాగం జోనల్ ఇన్చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం బొడ్డేపల్లిపేటలోనున్న జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంను లోతుగా పరిశీలిస్తే చంద్రబాబు ఎంత అవినీతిపరుడో బయటపడుతుందని అన్నారు. ఏమీ చేయకుండానే రూ. 371 కోట్లను ప్రభుత్వ ధనం చంద్రబాబు ఇంటికి చేరిందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పైడి రామారావు, కొప్పల ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇచ్ఛాపురంలో సన్యాసిపుట్టుగను విలీనం చేయాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం కవిటి మండలంలోని రెండు మండలాల మధ్య ఉన్న సన్యాసిపుట్టుగను ఇచ్ఛాపురం మండలంలో విలీనం చేయాలని ఎంపిటిసి సభ్యుడు ఎం.చక్రవర్తి రెడ్డి జిల్లా కలెక్టరుకి విజ్ఞప్తి చేశారు. తమ పంచాయతీలోతమ గ్రామమైన సన్యాసి పుట్టుక సగం కవిటి మండలం నెలవంక పంచాయతీలోనూ, కొంత భాగం కేశపురం పంచాయతీ ఇచ్ఛాపురం మండలంలో ఉందని,. ఇలా సగభాగం దాంట్లో సగభాగం దీంట్లో ఉండడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.. సుమారు మూడు వేల మంది ఓటర్లున్న ఈ గ్రామాన్ని పంచాయతీగా చేసి ఇచ్ఛాపురం మండలంలో కలిపి న్యాయం చేయాలన్నారు. గతంలో కూడా ఉమ్మడి రాష్ట్రంలో చాలాసార్లు అర్జీలు పెట్టినా పట్టించుకోలేదని కలెక్టర్‌ని అభ్యర్థించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస 33/11కెవి సబ్‌స్టేషన్‌లో నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ సంపతరావు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రావివలస వచ్చే సరఫరా 11కెవి టౌన్-1ఫీడర్ పరిధిలోని టెక్కలి కార్యాలయం, శ్రీనివాసనగర్, ఎన్‌టిఆర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, రోటరీ నగర్, ఆర్‌టిసి డిపో ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సందడి

టెక్కలి : వారంతా 5 పదుల పై బడి వయసు దాటిన వారే. ప్రస్తుతం ఒకొక్కరు ఒక్కో రంగంలో స్థిరపడ్డారు. 40 ఏళ్ల క్రితం టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1983-85లో చదువుకున్న వీరంతా శనివారం ఆత్మీయ వేడుకను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ పరిచయాలు ఒక్కసారిగా గుర్తుకు తెచ్చుకున్నారు. అంతే వయసును పక్కన బెట్టి నాటి పలకరింపులు, పులకరింతలతో 40 ఏళ్ల జ్ఞాపకాలను గుర్తుకు తీసుకువచ్చి నెమరువేసుకున్నారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ గొండేల సుజాత, టంకాల బాలగంగాధర్ గుప్త, దివ్వల విద్యాసాగర్, రోణంకి శ్రీనివాసరావు, రోణంకి విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, నారాయణ, రమ, గోవిందరాజు, శంకరి పాల్గొన్నారు.

చెరువులో పూడికల తొలగింపు

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్ల కోనేరు చెరువులో శనివారం పూడికలు తొలగించారు. చెరువులో విపరీతంగా పూడికలు పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సాగునీరు పంట భూములకు వెళ్లకుండా అడ్డు కుంటుందని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, గ్రామస్తులు పూడికలు తొలగించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొందర ఈశ్వరరావు, కోరాడ నాగరాజు పాల్గొన్నారు.

29 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నేత్రాలను పరీక్షిస్తున్న జానకిరామయ్య

కొత్తూరు : మండలంలోని బలద గ్రామంలో శనివారం వై.ఎస్.ఆర్. కంటి పరీక్షలో భాగంగా ఆప్తాల్మిక్ వైద్యాధికారి ఐ. జానకి రామయ్య ఆధ్వర్యంలో 29 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో నలుగురుకి అంతర కుసుమాలున్నట్లు గుర్తించి వీరిని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించి ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. 11 మందికి దష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి అద్దాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది సజన, పావని, శ్రీను, ఈశ్వరమ్మ, స్వాతిలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

కేన్సర్ రోగికి ఆర్థికసాయం

కవిటి: గొంతు కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న కవిటికి చెందిన పొల్లాయి లక్ష్మీనారాయణకు వరకకు చెందిన అగ్నికుల క్షత్రియ సంఘం అండగా నిలిచింది. శనివారం గ్రామానికి చేరుకుని అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు బాధితునికి రూ.5,500లు అందించారు. అంతేకాకుండా కేన్సర్‌తో పోరాడుతున్న లక్ష్మీనారాయణకు దాతలు అండగా నిలవాలని కోరారు. కేత గెడ్డయ్య, తెలుకుల కృష్ణారావు, పొల్లాయి కృష్ణారావు, దేవరాజు, దుర్యోధన, రుద్రయ్య, పందిరి రమేష్, భాస్కరరావు, వి.చందు, లచ్చయ్య పాల్గొన్నారు.

గృహ సారథులకు బీమా

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు సచివాలయంలో 15 మంది గృహ సారథులకు వైఎస్ఆర్ బీమా కల్పించామని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య తెలిపారు. ఈ మేరకు బీమా పత్రాన్ని శనివారం అందజేశారు. వైసిపి బలోపేతానికి గృహ సారథుల పాత్ర కీలక మని అన్నారు. వీరి సేవలను దృష్టిలో ఉంచుకుని బీమా సౌకర్యం కల్పించామని అన్నారు. జెసిఎస్ కన్వీనర్ శాలిని ఢిల్లి, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులు నిలుపుదల

ఆటోను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

పలాస: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు కావడంతో శనివారం ఉదయం 11.30 గంటల వరకు ఆర్టీసీ బస్సులు నిలిపి వేశారు. వేకువజామున నుంచి తిరగాల్సి ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధ్యాహ్నం వరకు బస్సులు నిలిపి వేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం విధుల్లో చేరాల్సిన డ్రైవర్లు, కండక్టర్లు కాంప్లెక్స్ వద్ద ఖాళీగా కూర్చున్నారు.

టెక్కలి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆరెస్టు సందర్భంగా శనివారం స్థానిక ఆర్‌టిసి డిపోల నుంచి బస్సులు కదలలేదు. దీంతో ప్రయాణికులు పలు అవస్థలకు గురయ్యారు. పెళ్లిలు, శుభకార్యాలు ఉండడంతో ప్రయాణికులు ముందుగా ఆర్‌టిసి బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్సులు నిలిచిపోవడంతో మొదట్లో ఏమి ఏమి జరిగిందో తెలియక గాబరా పడ్డాడు. తరువాత సమాచారం తెలుసుకుని ప్రయివేట్ వాహనాల్లో ప్రయాణించారు. దీంతో ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో టిక్కెట్ రేట్లు కూడా పెంచేశారు. టెక్కలి ఆర్‌టిసి డిపో నుంచి సుమారు 56 రూట్లకు సంబంధించిన 45 బస్సులు నిలిచిపోయాయి.

పింఛన్‌ను అందజేస్తున్న సర్పంచ్ రమణమ్మ

నూతన పింఛన్ల పంపిణీ

పోలాకి: అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్ మజ్జి రమణమ్మ అన్నారు. శనివారం పోలాకి సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన ఫించన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫించన్లు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి మండల యువజన విభాగం అధ్యక్షుడు ఆర్. త్రినాథరావు, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సౌదీ అరేబియాలో ఇద్దరు మృతి

రోహిత్ (ఫైల్)

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సౌదీ అరేబియాలోని సీమన్‌లో శ్రీకాకుళం జిల్లావాసితో పాటు ఒడిశాకు చెందిన మరో వ్యక్తి మృతి చెందారు. అక్కడి కంపెనీ నుంచి సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం...మలగాం పంచాయతీ కారిపేట గ్రామానికి చెందిన కొమర రోహిత్ (31) కొమర భీమారావు, లక్ష్మీబాయి పెద్ద కుమారుడు. ఈయనతోపాటు ఒడిశాకు చెందిన మరో యువకుడు మార్చి 18న సౌదీ అరేబియాకు వెళ్లారు. షిప్పులో ట్యాంకర్ క్లీనింగ్ కోసం రోహిత్‌తోపాటు ఆ యువకుడు ట్యాంకర్‌లో దిగారు. ఆక్సిజన్ లెవెల్ చూసిన తర్వాత ట్యాంకర్‌లోకి దిగాల్సి ఉంది. షిప్పుల సెక్యూరిటీ సిబ్బంది అవేమీ చూడకుండా ఆక్సిజన్ లెవెల్ సరిగ్గా ఉందని చెప్పడంతో ట్యాంకర్‌లో దిగి ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 7న షిప్‌లో చనిపోయినట్లు కంపెనీ నుంచి కొట్టం సభ్యులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. చనిపోయిన ఇద్దరి మృతిదేహాలను ఇరాన్ పోర్టుకు తరలించినట్లు కంపెనీ అధికారులు కుటుంబ సభ్యులకు తెలిపారు. తండ్రి భీమారావు తమ్ముడు వెంకటేష్ ఇద్దరూ గోవాలో వలలు అల్లికల కోసం వలస వెళ్లి ఉన్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దేహాలను గ్రామానికి తీసుకుని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. కుమారుడు మరణ వార్త విని తల్లి లక్ష్మీబాయి, కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.. రోహిత్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

నందిగాం : మండలంలోని సుభద్రాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సప్ప చిన్నమ్మ (63) మృతి చెందింది. శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్తుండగా... గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ అమీర్ హమ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారుడు శివ ఉన్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

యువకునికి గాయాలు

పలాస: పలాస అన్నపూర్ణ థియేటర్ కూడలి కేటి రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సిపురానికి చెందిన కిసాన్ తీవ్రంగా గాయపడ్డాడు. పలాస నుంచి కాశీబుగ్గ వైపు ఆటో వస్తున్న ఆటోను బైక్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.